జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php

ప్రజాపాలన దినపత్రికలో
పుట్టినరోజు / ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు రూ. 500
కోర్టు నోటీసులు / పబ్లిక్/ కంపెనీస్ నోటీసులు రూ. 600
Contact : 8886022523, 9000621111, 9948725373

సంపుటి 9 సంచిక 151 హైదరాబాద్, ఆగష్టు 31 సోమవారం 2026 8 పేజీలు వెల : 5.00

# దేశానికి డ్రగ్స్ పీడ వదిలిపోవాలి..

## 'మన్ కీ బాత్'లో ప్రధాని

ఢిల్లీ, ప్రజాపాలన : వికసిత్ భారత్ లక్ష్యం సాకారమయ్యేందుకు దేశానికి డ్రగ్స్ పీడ వదిలిపోవాలని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. మన్ కీ బాత్ రేడియో కార్యక్రమం 137వ ఎపిసోడ్‌లో నేడు ప్రధాని మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. భారత దేశ భవితను కాపాడుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఇటీవల ప్రారంభమైన 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమం' విజయవంతంగా సాగుతోందని ప్రధాని మోదీ అన్నారు. భారీ సంఖ్యలో యువత ఈ కార్యక్రమంలో పాల్గొంటోందని చెప్పారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా కంటెంట్ క్రియేటర్లు తమ తమ భాషల్లో ప్రచారం చేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఈ వ్యసనం కుటుంబాలను, సమాజాన్ని నాశనం చేస్తుందని హెచ్చరించారు. మాదకద్రవ్యాలకు యువత ఎందుకు దూరంగా ఉండాలో విశదీకరించాలని కంటెంట్ క్రియేటర్లకు సూచించారు. డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న వారిని, ఈ వ్యసనానికి బానిసలైన వారికి సాయం చేసే వారిని ప్రధాని ఈ సందర్భంగా



ప్రశంసించారు. వందేమాతరం గేయాన్ని రచించి 150 ఏళ్లు పూర్తైన సందర్భంలో ఈ సంవత్సరం భారతీయులందరికీ ఎంతో ప్రత్యేకమైనదని కూడా ప్రధాని చెప్పారు. సూర్యపథ్ తిరంగా కార్యక్రమం ద్వారా ఈ ఏడాది మువ్వన్నెల జెండా యావత్ ప్రపంచాన్ని చుట్టొచ్చిందని అన్నారు. మహిళల అభ్యున్నతి కోసం ఉద్దేశించిన పీఎం స్వనిధి యోజన గురించి ప్రధాని మాట్లాడారు. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 35 లక్షల మంది మహిళలు తమ వ్యాపారాలను విస్తరించగలిగారని అన్నారు. పరిశరాల పరిశుభ్రతపై నిరంతరం దృష్టి పెట్టాలని కూడా పిలుపునిచ్చారు. స్థానిక ఉత్పత్తులకు భారతీయులు ప్రాధాన్యం ఇవ్వాలని కూడా సూచించారు.

# తెలంగాణలో గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు: మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి : తెలంగాణలో గోదావరి పుష్కరాలను ఈసారి ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. గోదావరి పుష్కరాలు అంటే ఇప్పటివరకు రాజమండ్రి మాత్రమే గుర్తొచ్చేదని, ఇకపై తెలంగాణలోనూ పుష్కరాలను గ్రాండ్‌గా నిర్వహించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించిందని వెల్లడించారు. ఈ ఏర్పాట్లలో భాగంగా పుష్కరాల స్పెషల్ ఆఫీసర్ కార్యాలయాన్ని ప్రజాభవన్‌లో ప్రారంభించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా పుష్కరాల ఏర్పాట్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు. గోదావరి నది వెంట బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి



సారించిందని కొండా సురేఖ తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆయా ప్రాంతాల్లోని దేవాలయాలను అభివృద్ధి చేసేలా పనులు చేపడుతున్నామని చెప్పారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పుష్కరాల పనులు ప్రారంభమయ్యాయని, మరికొన్ని పనులు టెండర్ దశలో ఉన్నాయని వివరించారు. ముఖ్యమంత్రి డైరెక్షన్‌లో అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. తెలంగాణలో గోదావరి పుష్కరాలను భక్తులకు గుర్తుండిపోయేలా భారీ స్థాయిలో నిర్వహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# తెలంగాణ వేదికగా ఖేలో ఇండియా

## నాలుగు నగరాల్లో యువ క్రీడా సంబరం



యువతలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహించే ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఈసారి తెలంగాణ గడ్డపై జరగనున్నాయి. దేశ వ్యాప్తంగా వేలాది మంది యువ క్రీడాకారులు ఒకే వేదికపై తమ ప్రతిభను ప్రదర్శించనుండటంతో రాష్ట్రంలో క్రీడా సందడి నెలకొననుంది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ నగరాలు ఈ ప్రతిష్ఠాత్మక పోటీలకు ఆతిథ్యం ఇవ్వనుండగా.. జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణతో తెలంగాణ క్రీడా రంగానికి కొత్త ఊపు రానుంది.

హైదరాబాద్, ప్రజాపాలన ప్రతినిధి :

- హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్‌లో పోటీలు
- 25 క్రీడాంశాల్లో 6 వేల మంది క్రీడాకారులు
- డిసెంబరులో 8వ ఎడిషన్ ఖేలో ఇండియా యూత్ గేమ్స్
- నిర్వహణకు కేంద్రం ₹22 కోట్లు
- తెలంగాణకు ఆతిథ్యంపై కిషన్‌రెడ్డి హర్షం

8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ డిసెంబరులో తెలంగాణలో జరగనున్నాయి. నాలుగు నగరాల్లో నిర్వహించే ఈ పోటీల్లో 25 క్రీడాంశాల్లో దేశవ్యాప్తంగా సుమారు 6 వేల మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. యువ క్రీడాకారులకు జాతీయ స్థాయిలో తమ సత్తా చాటుకునే అవకాశం కల్పించడంతో పాటు.. రాష్ట్రంలోని క్రీడా మౌలిక వసతులకు ఈ గేమ్స్ మరింత ఊతమివ్వనున్నాయి.

### నాలుగు నగరాల్లో క్రీడా సందడి

కేంద్రప్రభుత్వంఖేలోఇండియాయూత్ గేమ్స్ నిర్వహణ బాధ్యతలను తెలంగాణకు అప్పగించింది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్‌లో వివిధ క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నాయి. ఆతిథ్య రాష్ట్రంగా తెలంగాణ ఒక స్థానిక క్రీడను ప్రతిపాదించే అవకాశం ఉండగా.. ఈ ఎడిషన్‌లో మరో కొత్త క్రీడను కూడా చేర్చనున్నారు. పోటీల నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.22 కోట్లు విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(SAI),నేషనల్‌స్పోర్ట్స్ ఫెడరేషన్స్,స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, సీబీఎస్ఈ,ఖేలోఇండియాకమిటీలుసమన్వయంతో గేమ్స్‌ను నిర్వహించనున్నాయి.




### యువ ప్రతిభకు జాతీయ వేదిక

దేశంలోని మారుమూల ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడమే ఖేలో ఇండియా కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. యువ క్రీడాకారులకు పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించడంతో పాటు.. శిక్షణ, మౌలిక వసతులు, అవసరమైన ప్రోత్సాహం అందించేందుకు కేంద్రం పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఖేలో ఇండియా యూత్ గేమ్స్, యూనివర్సిటీ గేమ్స్, పారా గేమ్స్, వింటర్ గేమ్స్, బీచ్ గేమ్స్ తదితర పోటీల ద్వారా క్రీడాకారులకు జాతీయ స్థాయి వేదిక కల్పిస్తోంది.

### తెలంగాణలో రూ.30 కోట్ల వసతులు

ఖేలో ఇండియా పథకం కింద తెలంగాణలో సుమారు రూ.30 కోట్ల విలువైన క్రీడా వసతులు అభివృద్ధి చేసినట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఇందులో రూ.11.5 కోట్లతో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో సింథటిక్ అథ్లెటిక్స్ ట్రాక్, సింథటిక్ టెన్నిస్ కోర్టు, మహిళల కోసం ప్రత్యేక స్విమ్మింగ్ పూల్ వంటి సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. మరో రూ.18.5 కోట్లతో రాష్ట్రంలోని వివిధ పట్టణాల్లో క్రీడా మౌలిక వసతులు అభివృద్ధి చేసినట్లు వివరించారు. రాష్ట్రంలో 33 ఖేలో ఇండియా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద మరో రూ.8.5 కోట్లు క్రీడాభివృద్ధికి ఖర్చు చేసినట్లు తెలిపారు.



### వెలుగులోకి గ్రామీణ క్రీడాకారుల ప్రతిభ

తెలంగాణకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఆతిథ్యం దక్కడంపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఖేలో ఇండియా వంటి కార్యక్రమాలు గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని ప్రతిభను వెలుగులోకి తీసుకువస్తున్నాయని తెలిపారు. దేశ యువతలో అపారమైన క్రీడా ప్రతిభ ఉందని.. దానిని వెలికితీసేందుకు తగిన క్రీడా సదుపాయాలు, శిక్షణ, ప్రోత్సాహం అవసరమని పేర్కొన్నారు. ఈ అవకాశం కల్పించిన ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు ధన్యవాదాలు తెలిపారు.

### అంతర్జాతీయ స్థాయిలో ఫలితాలు

యువ క్రీడాకారులను గుర్తించి అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం ఖేలో ఇండియాతో పాటు టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (TOPS), జాతీయ క్రీడా సమాఖ్యలకు సహాయం తదితర కార్యక్రమాలను అమలు చేస్తోంది. తెలంగాణకు చెందిన బాక్సర్ నిఖత్ జరీన్, బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు వంటి క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించిన ఉదాహరణలుగా కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

### రాష్ట్ర యువతకు సువర్ణావకాశం

తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ రాష్ట్ర యువ క్రీడాకారులకు కీలక అవకాశంగా మారనుంది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులతో పోటీ పడే అవకాశం లభించడంతో పాటు.. జాతీయ స్థాయి పోటీల నిర్వహణతో రాష్ట్ర క్రీడా రంగానికి మరింత ప్రోత్సాహం లభించనుంది. నాలుగు నగరాల్లో జరగనున్న ఈ పోటీలు యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంచడంతో పాటు.. తెలంగాణ నుంచి కొత్త క్రీడా ప్రతిభను వెలుగులోకి తీసుకురావడానికి దోహదపడనున్నాయి.